సాక్షి
పశ్చిమగోదావరి

గురువారం । 28 । నవంబర్ । 2024



మధ్యాహ్న భోజనానికి గ్రహణం

పెరిగిన ధరలకు అనుగుణంగా మొత్తాన్ని పెంచకపోవడంతో మధ్యాహ్న భోజన నిర్వాహకులు అప్పు చేసి వంట చేస్తున్నారు. దీంతో ఆహారంలో నాణ్యత లోపించింది. 8లో ▸



ఆట్యాపాట్యా జట్ల ఎంపిక

ఆట్యా, పాట్యా జిల్లా స్థాయి సీనియర్ సెలక్షన్స్ పోటీలు భీమవరంలో నిర్వహించారు. సీనియర్స్ పురుషులు, మహిళల జట్లను ఎంపిక చేశారు. 8లో ▸



భారీ చోరీ

నూజివీడు ఎంప్లాయీస్ కాలనీలో భారీ చోరీ జరిగింది. ఏపీసీపీడీసీఎల్ పట్టణ ఏడీ ఇంట్లో దాదాపు 25 కాసుల బంగారు నగలను దుండగులు దోచుకెళ్లారు. 8లో ▸

న్యూస్‌రీల్

అవకాశాలు అందిపుచ్చుకోవాలి



నిట్‌లో మాట్లాడుతున్న తిరుపతి ఐఐటీ ప్రొఫెసర్ డాక్టర్ చీమలకొండ శ్రీధర్

తాడేపల్లిగూడెం: తరగతి గదే దేశ భవిష్యత్‌ను నిర్ణయిస్తుందని, ఆశలను అవకాశాలుగా మార్చుకోవడమే ఆధునిక టెక్నాలజీ అని తిరుపతి ఐఐటీ కంప్యూటర్ సైన్సు ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ చీమలకొండ శ్రీధర్ చెప్పారు. బుధవారం నిట్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన పలు విషయాల గురించి విద్యార్థులకు వివరించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను విద్యార్థులు నిశితంగా పరిశీలిస్తే , వాటిలో నుంచి కొత్త ఆలోచనలు వస్తాయన్నారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో భవిష్యత్ అంతా కృత్రిమ మేధస్సుదే అన్నారు. కొత్త సాంకేతికతను అందిపుచ్చుకున్నవారే ఉద్యోగ అవకాశాలను పొందగలరన్నారు. కృత్రిమ మేధస్సు, సాంకేతికత ప్రాధాన్యతలపై విద్యార్థుల సమస్యలను నివృత్తి చేశారు.

ఎస్వీకేపీలో అంతర్జాతీయ తెలుగు సదస్సు

పెనుగొండ: పెనుగొండ ఎస్వీకేపీ కళాశాలలో బుధవారం అంతర్జాతీయ తెలుగు సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వైవీ అప్పారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పలు అంశాలపై చర్చించారు. కళాశాల మాజీ తెలుగు విభాగాధిపతి డాక్టర్ రామ్మోహన్‌రావు సదస్సు ప్రాధాన్యతను వివరించారు. అనంతరం రాజమండ్రి మానస హాస్పిటల్ అధినేత డాక్టర్ కర్రి రామారెడ్డి యోగా ప్రాముఖ్యతను వివరించారు. కళాశాల అధ్యక్షుడు తాడి నాగిరెడ్డి, నన్నయ యూనివర్సిటీ తెలుగు విభాగాధిపతి వరప్రసాద్, వాసిలి వసంతరావు తదితరులు ప్రసంగించారు.

మావుళ్లమ్మ దీక్షల విరమణ




మావుళ్లమ్మ ఆలయం వద్ద దీక్ష విరమణ పూజలు

భీమవరం(ప్రకాశం చౌక్): మావుళ్లమ్మ అమ్మవారి దీక్ష విరమణ బుధవారం జరిగింది. ప్రధాన అర్చకులు బ్రహ్మశ్రీ మద్దిరాల మల్లికార్జున శర్మ పూజలు నిర్వహించారు. 400 మంది భక్తులు దీక్ష విరమించారు. అనంతరం భక్తులు పూజ సామగ్రి పూర్ణాహుతిలో సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మీ నగేష్ తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు (టూటౌన్): ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో డీఎస్సీ పరీక్షకు హాజరయ్యే మైనారిటీ విద్యార్థులకు ఉచిత శిక్షణ కోసం దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి ఎస్.కృపావరం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ దరఖాస్తులను డిసెంబర్, 12లోగా మైనార్టీ సంక్షేమ శాఖ, విజయవాడ 520 012 చిరునామాకు పంపాలన్నారు. ఇతర వివరాలకు 0866–2970567 నెంబర్‌కు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చన్నారు.

ఏరియా ఆసుపత్రికి అవార్డు



తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రి

తాడేపల్లిగూడెం: ప్రాంతీయ ఆసుపత్రులలో పారిశుద్ధ్యం, పరిశుభ్రతకు ఇచ్చే అవార్డుల్లో భాగంగా 2023–24 సంవత్సరానికి తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి రాష్ట్ర స్థాయి కాయకల్ప అవార్డు దక్కింది. ఈ అవార్డు కింద రూ.10 లక్షల రివార్డు అందనుంది. రెండో స్థానంలో ఏలూరు జిల్లా నూజివీడు ఆసుపత్రి ఎంపికైంది. ఈ ఆసుపత్రికి రూ. 7 లక్షల రివార్డు ఇస్తారు. తమ ఆసుపత్రికి అవార్డు రావడం ఆనందంగా ఉందని సూపరింటెండెంటు డాక్టర్ తాతారావు చెప్పారు.

8న ఎన్ఎంఎంఎస్ పరీక్ష

ఏలూరు (ఆర్ఆర్‌పేట): 2024–25 విద్యా సంవత్సరానికి జాతీయ ఉపకార వేతనం నిమిత్తం నిర్వహించే నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష వచ్చే డిసెంబర్ 8న నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకట లక్ష్మమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ జరిగే పరీక్షకు హాజరయ్యే విద్యార్థుల హాల్ టిక్కెట్లను ప్రభుత్వ పరీక్షల సంచాలకుల కార్యాలయం వెబ్‌సైట్‌లో స్కూల్ లాగిన్‌లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.

రోడ్డెక్కితే టోల్ బాదుడే

- ఉమ్మడి పశ్చిమలో మూడు రోడ్లు ఖరారు
- పీపీపీ పద్ధతిలో ప్రైవేట్‌కు అప్పగించడానికి రంగం సిద్ధం
- మొదటి విడత సర్వేలో జిల్లా రోడ్ల ఎంపిక
- ప్రైవేట్ టోల్‌ను వ్యతిరేకిస్తున్న రవాణా రంగం అసోసియేషన్



ఏలూరు - జంగారెడ్డిగూడెం ప్రధాన రహదారి

సాక్షి ప్రతినిధి, ఏలూరు: రాష్ట్ర రహదారులకు టోల్ పెట్టేందుకు రంగం సిద్ధమైంది. కిరాయి మీద వచ్చే ఆదాయం రిపేర్లకు కొంత పోతే కొత్తగా టోల్‌గేట్లు పెడితే తమకు మిగిలేదేమి ఉండదని లారీ అసోసియేషన్ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి పశ్చిమలో పబ్లిక్, ప్రైవేటు భాగస్వామ్యంలో మూడు రహదారులను సెర్వే పేరుతో ఎంపిక చేసి టోల్ బాదుడుకు సన్నద్ధం చేశారు.

ఉమ్మడి పశ్చిమలో 12 వేల వరకూ లారీలు

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలో 13 రాష్ట్ర రహదారులున్నాయి. ప్రధానంగా ఏలూరు జిల్లా నుంచి ఇసుక, మొక్కజొన్న, కొబ్బరి, వరి, పామాయిల్, కలప, చేపలు, పశ్చిమగోదావరి జిల్లా నుంచి ఆక్వా ఉత్పత్తులు, కొబ్బరితో పాటు ధాన్యం, ఉల్లిపాయలు, నూనె, ఐస్ తదితర ఉత్పత్తుల రవాణా నిత్యం జరుగుతుంటుంది. ఉమ్మడి పశ్చిమలో ఒక్కొక్క ఉత్పత్తి ఒక్కో ప్రాంతంలో ప్రసిద్ధి చెందడంతో దానికి అనుగుణంగా లారీలు నడుపుతున్నారు. ఉమ్మడి పశ్చిమలో 12 వేల వరకు లారీలు ఉన్నట్లు అంచనా. వీటిలో 60 శాతం లారీలకు పూర్తి స్థాయిలో కిరాయిలు దొరుకుతుంటాయి. ఇప్పటికే ఉమ్మడి పశ్చిమలో కలపర్రు జాతీయ రహదారి టోల్‌గేటు, ఉంగుటూరు వద్ద టోల్‌గేట్లు ఉన్నాయి. లోకల్ లారీలకు రూ.250, నేషనల్ పర్మిట్ ఉన్న లారీలకు రూ.425 టోల్ వసూలు చేస్తున్నారు. కిరాయిలతో పాటు టోల్‌గేట్ ఛార్జీలు తప్పనిసరిగా యజమానుల నుంచి వసూలు చేస్తున్నారు.

తాజాగా మరో మూడు రహదారులు

జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా మూడు రహదారుల్లో టోల్ ఏర్పాటు చేయడానికి అనువుగా ఉన్నట్లు నిర్ధారించింది. వీటిలో నర్సాపురం–అశ్వారావుపేట ప్రధాన రహదారి 100.55 కిలోమీటర్లు, ఏలూరు– మేడిశెట్టివారిపాలెం ప్రధాన రహదారి 70.93 కిలోమీటర్లు, ఏలూరు– జంగారెడ్డిగూడెం (51.73 కి.మీ.) ఉన్నాయి. ఈ మూడు రహదారుల్లో పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్యంతో టోల్‌గేట్లను ఏర్పాటు చేసి కాంట్రాక్టర్లకు బాధ్యత అప్పగించాలని నిర్ణయించారు. దానిలో భాగంగా సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేయడానికి రవాణ శాఖ, ఆర్అండ్‌బీ, ఇతర శాఖల అధికారులను నియమించారు. ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించి డీపీఆర్ సిద్ధం చేయించడంతో పాటు 15 రోజుల్లోగా అధికారుల నుంచి తుది నివేదిక తీసుకోనున్నారు.

టోల్‌గేట్లతో అదనపు భారం

రాష్ట్ర రహదారుల్లో ఇంతవరకు టోల్‌గేట్లు అనేవి లేవు. వ్యవసాయ ఆధారిత జిల్లా కావడంతో దానికి సంబంధించిన ఉత్పత్తులే నిత్యం రవాణా జరుగుతుంటాయి. మూడు ప్రధాన రహదారుల్లో టోల్ గేట్లు ఏర్పాటు చేస్తే అదనపు భారం పడుతుంది. ఏలూరు జిల్లాలో 13 రాష్ట్ర రహదారులను అనుసంధానం చేస్తూ జాతీయ రహదారులున్నాయి. విజయవాడ–భువనేశ్వర్ జాతీయ ప్రధాన రహదారి కావడంతో ప్రతి నిత్యం 30 నుంచి 35 వేల వాహనాల రాకపోకలు సాగిస్తున్నాయి. కొత్తగా ఎంపిక చేస్తున్న మూడు రహదారుల్లో రద్దీ కూడా ఎక్కువగా ఉంటుంది. సగటున మూడు రహదారుల్లో ఆటోలు మొదలుకొని లారీల వరకు 15 వేల వరకు వాహనాల రాకపోకలుంటాయని అధికారులు అంచనా.

• నేత్రపర్వం.. తెప్పోత్సవం



మద్ది క్షేత్రం కొలనులో స్వామివారి తెప్పోత్సవం

జంగారెడ్డిగూడెం మండలం గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయ స్వామి క్షేత్రంలో జరుగుతున్న కార్తీక మాస మహోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి క్షేత్రంలో ఉన్న కొలనులో స్వామి వారి తెప్పోత్సవం కార్యక్రమం నేత్రపర్వంగా నిర్వహించారు. స్వామి వారికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారి తెప్పోత్సవ కార్యక్రమాన్ని వీక్షించారు. ఆలయ సహాయ కమిషనర్ ఆర్‌వీ చందన పాల్గొన్నారు. **- జంగారెడ్డిగూడెం రూరల్**



స్వామివారికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

అక్రమ అరెస్టులను అడ్డుకుంటాం



మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన ఏలూరు జిల్లా వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ నాయకులు

ఏలూరు టౌన్: కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్రంలో అరాచకాలు పెరిగిపోయాయని, వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కార్యకర్తలపై కేసులు పెట్టడం దుర్మార్గమని ఏలూరు జిల్లా వైస్సార్‌సీపీ లీగల్ సెల్ నాయకులు అన్నారు. బుధవారం విజయవాడలో వైస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఏలూరు న్యాయవాది ప్రత్తిపాటి తంబి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా సోషల్ మీడియా కార్యకర్తలను వేధిస్తున్నారని, కేసుల పేరుతో భయభ్రాంతులకు గురిచేస్తున్నారని తెలిపారు. సోషల్ మీడియా కార్యకర్తలకు అండగా ఉంటూ భరోసా ఇవ్వాలని కోరారు. పార్టీ కార్యకర్తలు సైతం అనవసర విమర్శలు చేయకుండా ప్రజల సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి చొరవ తీసుకోవాలని కోరారు. ఏలూరు జిల్లా కామవరపుకోట ప్రాంతానికి చెందిన న్యాయవాది కే కిరణ్ కుమార్ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మర్యాదపూర్వంగా కలిశారు. సోషల్ మీడియా కార్యకర్తలపై వేధింపులను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో న్యాయవాదులు కొండ యశ్వంత్, ప్రత్తిపాటి విజయ్ తదితరులు ఉన్నారు.

కార్యకర్తలకే ప్రాధాన్యం

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు



కలగంపూడిలో పాలకొల్లు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు

యలమంచిలి: వైఎస్సార్‌సీపీకి కార్యకర్తలే బలమని, ఇకపై వారి చెప్పిన దానికే పార్టీలో ప్రాధాన్యం ఉంటుందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు చెప్పారు. కలగంపూడి గ్రామంలో బుధవారం జరిగిన పాలకొల్లు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయ కమిటీ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. గతంలో జరిగిన పొరపాట్లు పునరావృతం కావని ప్రసాదరాజు భరోసా ఇచ్చారు. నియోజకవర్గంలో అన్ని సామాజికవర్గాలకు ప్రాధాన్యతనిస్తూ సమన్వయ కమిటీ వేస్తామని, ఆ కమిటీ చేసిన సిఫార్సులకు మాత్రమే పనులు చేస్తామని చెప్పారు. ఇకపై ప్రతి నెల నియోజవర్గ స్థాయి సమావేశం నిర్వహిస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కమిటీలన్నీ రద్దయ్యాయని, త్వరలో కొత్త కమిటీలు కార్యకర్తల అభీష్టం మేరకు వేస్తామన్నారు. కూటమి నాయకులు కేసులు పేరిట భయపెడితే ఎవరూ అధైర్యపడవద్దని ప్రసాదరాజు చెప్పారు. రాష్ట్ర స్థాయిలో సీనియర్ లాయర్లతో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేశామన్నారు. ఏ కార్యకర్త మీదైన అక్రమ కేసులు పెడితే, ఆ సమాచారం నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యులకు చెప్పాలన్నారు.

లోపాలు సరిచేసుకుందాం: గుడాల గోపి

నియోజకవర్గంలో కార్యకర్తల కష్టాలను పట్టించుకునే నాథుడే లేకుండా పోయారని, నాయకుల అనైక్యత వలనే ప్రత్యర్థి విజయం సాధిస్తున్నాడని, పార్టీ పట్ల అంకితభావంతో పని చేసిన వారికి ప్రాధాన్యత దక్కడం లేదని పలువురు పేర్కొన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు మాట్లాడుతూ ఇంతవరకు జరిగిన వాటిలో లోపాలు ఉంటే సరి చేసుకుంటానన్నారు. ఇకపై కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ వారి అభీష్టం మేరకు పని చేస్తానన్నారు. ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ మాట్లాడు తూ ఎన్నికలలో గెలుపు ఓటములు సహజమని, 11 సీట్లకే పరిమితమయ్యామనే నిరాశ వద్దని, మనకు 40 శాతం ఓట్లు ఉన్నాయనే యథార్థాన్ని గుర్తించాలని కోరారు. ఎమ్మెల్సీ వంకా రవీంద్ర మాట్లాడుతూ మన పార్టీ మీద ప్రజలకు వ్యతిరేకత లేదన్నారు. ప్రత్యర్థి పార్టీలు మూడూ కూటమిగా ఏర్పడడం వలనే ఓటమి పాలయ్యామన్నారు. గ్రామ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసి మళ్లీ అధికారాన్ని చేజిక్కించుకుందామని చెప్పారు. ఎస్సీ కమిషన్ మాజీ సభ్యులు చెల్లెం ఆనందప్రకాష్ మాట్లాడుతూ పాలకొల్లు నియోజకవర్గంలో గ్రూపులు లేవన్నారు. నాయకులంతా కృషి చేయడం వలనే అన్ని ఓట్లు వచ్చాయన్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు గుణ్ణం నాగబాబు, యడ్ల తాతాజీ, చిలువూరి కుమార దత్తాత్రేయవర్మ, పీడీ రాజు, నడపన గోవిందరాజులునాయుడు, గుమ్మాపు పెద్దిరాజు, కవురు గోపి, ఉచ్చుల స్టాలిన్, సాలా నర్సయ్య, ఖండవల్లి వాసు, కుంచనపల్లి విన్స్టన్‌బాబు, వినుకొండ రవి, చందక సత్తిబాబు, మైలాబత్తుల మైకేల్‌రాజు, విప్పర్తి ప్రభాకరరావు, పితాని సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మూన్నాళ్ల ముచ్చటగా ప్రత్యేక కౌంటర్లు

భీమవరం: అధికారంలోకి వస్తే నిత్యావసరాలు ధరలు తగ్గిస్తామంటూ కూటమి నాయకులు ఎన్నికల ప్రచారంలో ఊదరగొట్టి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఆ మాటే మర్చిపోయారు. గత నెలలో వంట నూనెలు, టమాటాలు, ఉల్లిపాయల ధరల నియంత్రణకు ఏర్పాటుచేసిన ప్రత్యేక దుకాణాలు ప్రస్తుతం కన్పించడం లేదు. ఈ ప్రత్యేక దుకాణాలకు సరుకు సరఫరా లేక మూతపడ్డాయి. జిల్లాలోని భీమవరం, పాలకొల్లు, నరసాపురం రైతు బజార్లతోపాటు అన్ని నియోజకవర్గ కేంద్రాల్లోను ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటుచేసి ఉల్లిపాయలు, టమాటాలతోపాటు పామాయిల్, సన్‌ఫ్లవర్ విక్రయ కేంద్రాలు ఏర్పాటుచేశారు. ఈ కౌంటర్ల వద్ద మార్కెట్ కంటే తక్కువ ధరకు విక్రయాలు చేస్తారని గొప్పగా ప్రచారం చేశారు. ప్రభుత్వం ఏర్పాటుచేసిన ప్రత్యేక కౌంటర్ల వల్ల బహిరంగ మార్కెట్‌లో కూడా ధరలు అందుబాటులో ఉంటాయని చెప్పారు. ఈ కౌంటర్ల వద్ద టమాటాలు కిలో రూ.50, ఉల్లిపాయలు కర్నూల్ రకం కిలో రూ.32, మహారాష్ట్ర రకం రూ.47కి విక్రయిస్తారని, పామాయిల్ 850 గ్రాముల ప్యాకెట్ రూ.119, సన్‌ఫ్లవర్ 910 గ్రాముల ప్యాకెట్ రూ.127కే విక్రయిస్తారని ప్రచారం చేశారు. కూరగాయలు, నిత్యావసర సరుకుల ధరలు ఏమాత్రం తగ్గకపోగా మరింత పెరిగాయి. ప్రధానం ఉల్లి కిలో రూ. 80 వరకు విక్రయిస్తుంటే టమాటలు కిలో రూ. 60 పై మాటే. మిగిలిన కూరగాయల ధరలు కిల్లో రూ.50 తక్కువగాకుండా పలుకుతున్నాయి. పామాయిల్ ప్యాకెట్ రూ.135, సన్‌ఫ్లవర్‌వాయిల్ రూ.155కు విక్రయిస్తుండగా గ్రామాల్లో వీటి ధరలు మరింత ఎక్కువగానే ఉంటున్నాయని వినియోగదారులు చెబుతున్నారు. ప్రత్యేక కౌంటర్లలో తక్కువ ధరలకు దొరుకుతాయని వెళ్తుంటే దుకాణాలు మూసి ఉంటున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం నూనెలు సరఫరా చేయకపోవడం వల్లే ప్రత్యేక కౌంటర్లు మూతపడ్డాయని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రత్యేక కౌంటర్లు పనిచేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం



తణుకు రాష్ట్రపతి రోడ్డులో రాకపోకలు పరిశీలిస్తున్న ట్రాఫిక్ ఎస్సై ఆదినారాయణ

సాక్షి స్పందన

తణుకు అర్బన్: 'ట్రాఫిక్ పద్మవ్యూహం' శీర్షికన ఈ నెల 27న సాక్షిలో ప్రచురితమైన కథనానికి తణుకు పట్టణ సీఐ ఎన్. కొండయ్య స్పందించారు. సీఐ ఆదేశాల మేరకు బుధవారం ఉదయం నుంచి ట్రాఫిక్ ఎస్సై డి.ఆదినారాయణ తమ సిబ్బందితో కలిసి రాష్ట్రపతి రోడ్డు, వేల్పూరు రోడ్డు, స్త్రీ సమాజం రోడ్డుల్లో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా పర్యవేక్షించారు. బ్లూకోట్ వాహనాలపై ట్రాఫిక్ సిబ్బంది పట్టణ ప్రధాన రహదారుల్లో పెట్రోలింగ్ నిర్వహించారు.

బాల్య వివాహాలతో అనర్థం

భీమవరం(ప్రకాశం చౌక్) బాల్య వివాహాలతో అనర్థాలపై విస్తృత ప్రచారం కల్పించాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి సంబంధిత అధికారులను ఆదేశించారు. 'బాల్ వివాహ ముక్త్ భారత్' జాతీయ ప్రచార కార్యక్రమాన్ని న్యూఢిల్లీ విజ్ఞాన్ భవన్ నుంచి కేంద్ర మంత్రి అన్నపూర్ణాదేవి బుధవారం లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమాన్ని కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సంబంధిత శాఖ అధికారులతో కలిసి పాల్గొన్ని తిలకించారు. బాల్య వివాహాలను ప్రోత్సహిస్తే అమలు చేసే చట్టాలపై రూపొందించిన సమాచార గోడ ప్రతిని ఆవిష్కరించారు. సమావేశంలో జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారి బి.సుజాతరాణి, జిల్లా బాలల సంరక్షణ అధికారి ఆర్.రాజేష్, డీఎంహెచ్‌వో డాక్టర్ డి.మహేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో చేరేలా ప్రోత్సహించాలి



జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లతో సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం: ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో అధ్యాపకులు మంచి విద్యను అందించి విద్యార్థులను ప్రయోజకులను చేయాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో ప్రభుత్వ, ఎయిడెడ్ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లతో ఇంటర్మీడియట్ ఫలితాలు తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్‌ను నిర్దేశించే ఇంటర్మీడియట్ విద్యను అత్యంత నాణ్యతగా అందించాలన్నారు. టెన్త్ ఉత్తీర్ణులైన విద్యార్థుల తల్లిదండ్రులను ప్రోత్సహించి ఇంటర్‌లో చేరికలను పెంచేలా కృషి చేయాలన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో క్వాలిఫైడ్ అధ్యాపకులు, నాణ్యమైన విద్య, విశాలమైన తరగతి గదులు, ఆట స్థలం వంటివి ఉంటాయనే విషయం ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

భీమవరం(ప్రకాశం చౌక్): ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు మెరుగైన వైద్య సేవలను అందించాలని కలెక్టరు చదలవాడ నాగరాణి ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఆమె జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్లతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలో ప్రభుత్వ ఆస్పత్రుల పనితీరు, భవన నిర్మాణాలు, సదరన్ సర్టిఫికెట్ల జారీ, ఎఫ్ఆర్ఎస్ హాజరు తదితర 12 అంశాలపై మండలాల వారీగా సమీక్షించారు. లక్ష్యాలు లోటు ఉన్న మండలాలకు సంబంధించి వైద్యాధికారులపై అసహనం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో స్నేహ పూర్వకమైన వైద్య సేవలు అందించాలన్నారు. వైద్యాధికారులు, స్పెషలిస్టులు ప్రభుత్వ ఆస్పత్రిలో రెండవ పూట ఉండటం లేదని ఫిర్యాదులు వస్తున్నాయని పనితీరు మార్చుకోవాలన్నారు.

మెగా పేరెంట్-టీచర్ సమావేశంపై సమీక్ష

మెగా పేరెంట్ టీచర్స్ సమావేశాలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. డీఈవో, డిప్యూటీ డీఈఓలు, ఎంఈఓలతో మెగా పేరెంట్ - టీచర్ సమావేశాలపై దిశానిర్దేశం చేశారు.

క్లుప్తంగా

దళారులను నమ్మి మోసపోవద్దు



ధాన్యాన్ని పరిశీలిస్తున్న డీఏఓ వెంకటేశ్వరరావు

మొగల్తూరు : రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, ధాన్యాన్ని రైతు సేవా కేంద్రాల్లోనే విక్రయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి జెడ్ వెంకటేశ్వరరావు సూచించారు. బుధవారం ఆయన మొగల్తూరులో పర్యటించారు. జాతీయ రహదారిపై ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఎఫ్‌టీఓ (ఫండ్ ట్రాఫిక్ ఆర్డర్) ద్వారా రైతులు అమ్మిన ధాన్యానికి సొమ్ము 48 గంటల్లోపు రైతుల ఖాతాలో జమవుతాయని తెలిపారు. గోనె సంచులు అందుబాటులో ఉన్నాయని, కళ్లాల నుంచి తరలించే ధాన్యానికి అవసరమయ్యే రవాణా చార్జీలను ప్రభుత్వమే చెల్లిస్తుందని చెప్పారు. డీఏఓ వెంట ఏఓ అబ్దుల రహీమ్, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

పచ్చగడ్డిలో పోషకాలు పుష్కలం



పరిశీలిస్తున్న ఉద్యాన వర్సిటీ విస్తరణ సంచాలకులు గోవిందరాజులు

తాడేపల్లిగూడెం : పశువులకు సమతుల ఆహారం అందించడం పోషకుల ముఖ్యపాత్ర అని డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యానవర్సిటీ విస్తరణ సంచాలకులు బి.గోవిందరాజులు అన్నారు. వెంకట్రామన్నగూడెంలోని కేవీకేలో బుధవారం ఆయన పశువుల మేత కోసం చాఫ్‌కట్టర్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. పశువుల ఆహారంలో పచ్చగడ్డి ప్రధానమైన భాగమన్నారు. పోషకాలు పుష్కలంగా ఉన్న పచ్చగడ్డిని పశువులకు వేస్తే అవి ఆరోగ్యంగా ఉండటంతో పాటు పాల ఉత్పత్తి, మాంసం ఉత్పత్తిని పెంచుకోవచ్చని వివరించారు. పచ్చగడ్డిని చిన్న చిన్న ముక్కలుగా చాఫ్‌కట్టర్‌తో చేసి మేతగా వేయడం వల్ల పశువులు సులభంగా ఆహారం తీసుకోగలుగుతాయని చెప్పారు. కేవీకే ప్రిన్సిపల్ సైంటిస్టు ఇ.కరుణశ్రీ, దేవీవరప్రసాదరెడ్డి, రేఖ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొట్టిన ట్రాక్టర్

పెదవేగి : ట్రాక్టర్ అతివేగంగా వచ్చి ఢీకొట్టడంతో మోటారు సైకిల్‌పై వెళుతున్న కుటుంబం గాయాలపాలైంది. పెదవేగి ఎస్సై రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. దెందులూరు మండలం నాగుల దేవిపాడుకు చెందిన గుడ్డేటి బాబురావు అనే వ్యక్తి అతని భార్య, ఇద్దరు కుమారులతో కలిసి ఈనెల 25న సాయంత్రం మోటార్ సైకిల్‌పై కూచింపూడి వైపు వెళుతూ ఉండగా ట్రాక్టర్ ఢీకొట్టింది. దీంతో గాయాలపాలైన బాబురావు, అతని భార్య, కుమారులను స్థానికులు ఏలూరు ఆంధ్ర హాస్పిటల్‌కు తరలించారు. బాబురావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టామని ఎస్సై తెలిపారు.

మధ్యాహ్న భోజనానికి గ్రహణం

- డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనంగా పేరు మార్పుతో సరి
- పెరిగిన ధరలకు అనుగుణంగా మొత్తాన్ని పెంచని ప్రభుత్వం
- మూడు నెలలుగా రూ.1.3 కోట్ల మేర బకాయిలు
- అప్పుచేసి వంట చేస్తున్న నిర్వాహకులు
- ఆహారంలో లోపిస్తున్న నాణ్యత
- తగ్గుతున్న భోజనం చేసే వారి సంఖ్య



ఇంటి నుంచి క్యారేజీ తెచ్చుకుని భోజనం చేస్తున్న విద్యార్థినులు



ఇరగవరం మండలంలోని ఒక పాఠశాలలో డస్ట్‌బిన్‌లో పడేసిన రుచిలేని భోజనం



నరసాపురంలో విద్యార్థుల కోసం భోజనం సిద్ధం చేస్తున్న నిర్వాహకులు

సాక్షి, భీమవరం: విద్యార్థులకు పోషకాహారం అందించడమే లక్ష్యంగా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మెనూలో మార్పులు చేసి జగనన్న గోరుముద్దగా నాణ్యమైన ఆహారాన్ని అందించింది. కూటమి ప్రభుత్వం వచ్చాక మరింత మెరుగైన మెనూను అందిస్తామంటూ గొప్పలు చెప్పి ఈ పథకం పేరును డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంగా మార్చి చేతులు దులుపుకున్నారు. మార్కెట్‌లో నిత్యావసర సరుకుల ధరలకు అనుగుణంగా ధరలను పెంచేందుకు చొరవ చూపలేదు. ఇచ్చే చాలీచాలని మొత్తాన్ని కూడా సకాలంలో చెల్లింపులు చేయక బకాయిలు పేరుకుపోతున్నాయి.

వైఎస్సార్ సీపీ హయాంలోనే మేలు

పశ్చిమ గోదావరి జిల్లాలోని 1,368 ప్రభుత్వ పాఠశాలల్లో 92,873 మంది విద్యార్థులు ఉన్నారు. వీటిలో 52 పాఠశాలలకు తాడేపల్లిగూడెంకు చెందిన ఎన్‌జీఓ సంస్థ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజనం సరఫరా చేస్తుండగా, మిగిలిన పాఠశాలల్లో ఇంప్లిమెంటింగ్ ఏజెన్సీలు నిర్వహిస్తున్నాయి. మార్కెట్ ధరలకు అనుగుణంగా ఏడాది క్రితం గత ప్రభుత్వం విద్యార్థులకు చెల్లించే ధరలను సవరించింది. అప్పటి వరకు చెల్లిస్తున్న మొత్తంపై రూపాయి వరకు పెంపుదల చేసి ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు రూ.5.88, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు రూ.8.57 చొప్పున పెంచింది.

నిర్వాహకులకు భారం

గత కొద్ది నెలల్లో కాయగూరలు, నిత్యావసర సరుకుల ధరలకు రెక్కలొచ్చాయి. ఆరు నెలల క్రితం రూ.120గా ఉన్న కిలో కంది పప్పు నేడు రూ.180కు చేరింది. ఆయిల్ ప్యాకెట్ ధర రూ.90 నుంచి రూ.130కు పెరిగింది. కాయగూరలు కిలో రూ.50పైనే ఉంటున్నాయి. వంటలో వినియోగించే ఇతర సరుకుల ధరలూ భగ్గుమంటున్నాయి. పెరిగిన ధరలకు అనుగుణంగా విద్యార్థులకు చెల్లించే ధరలను సవరించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. దీనికితోడు ఇచ్చే అరకొర మొత్తాన్ని సకాలంలో చెల్లించడం లేదు. మూడు నెలలకు సంబంధించి రూ.1.3 కోట్లు బకాయిలు విడుదల కావాల్సి ఉంది.

అప్పుల పాలవుతున్న కార్మికులు

జిల్లాలో మధ్యాహ్న భోజన కార్మికులు 2,248 మంది ఉండగా, ఒక్కొక్కరికి కేంద్రం రూ.1,000, రాష్ట్ర ప్రభుత్వం రూ.2,000 కలిపి నెలకు రూ.3,000 గౌరవ వేతనం అందిస్తున్నారు. నెలకు రూ.67.44 లక్షలు గౌరవ వేతనంగా చెల్లించాల్సి ఉంది. కేంద్రం నిధులు సకాలంలోనే విడుదలవుతున్నా, రాష్ట్ర ప్రభుత్వ వాటాగా చెల్లించాల్సిన వేతనం సరిగా రావడం లేదని కార్మికులు వాపోతున్నారు. నెలల తరబడి బిల్లులు అందక కిరాణా వ్యాపారులు అరువులు ఇచ్చేందుకు నిరాకరిస్తుండటంతో అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి మధ్యాహ్నం భోజనాన్ని అందిస్తున్నామని చెబుతున్నారు. మార్కెట్‌లోని ధరలను బట్టి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు కనీసం రూ.10, హైస్కూల్ విద్యార్థులకు రూ 12 వరకు పెంచాలని కోరుతున్నారు.

సర్కారు నిర్లక్ష్యం

మార్కెట్ ధరలతో నిమిత్తం లేకుండా మెనూ మేరకు వంటకాలు సిద్ధం చేసి విద్యార్థులకు వడ్డించాల్సి ఉంది. ప్రభుత్వం చెల్లించే మొత్తానికి, మార్కెట్‌లోని సరుకుల ధరలకు పొంతన ఉండటం లేదు. కొందరు నిర్వాహకులు అప్పులు చేసి నాణ్యమైన సరుకులతో వంట చేస్తుండగా చాలాచోట్ల నాసిరకం సరుకులతోనే సరిపెడుతున్న పరిస్థితి నెలకొంది. ఫలితంగా ఆహారంలో నాణ్యత లోపిస్తుందన్న ఆరోపణలున్నాయి. గతంలో 90 శాతం మంది విద్యార్థులు ఈ పథకాన్ని వినియోగించుకోగా ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ప్రస్తుతం వారి సంఖ్య తగ్గినట్టు గణాంకాలు చెబుతున్నాయి. బుధవారం జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలకు హాజరైన 79,859 మంది విద్యార్థుల్లో 70,412 మంది మాత్రమే మధ్యాహ్న భోజనం చేశారు. ఈ భోజనం రుచిగా లేకపోతుండటంతో కొందరు విద్యార్థులు పడేస్తున్నారు. ఇంటి నుంచి భోజనం తెచ్చుకునే వారి సంఖ్య పెరుగుతోంది. మార్కెట్ ధరలకు అనుగుణంగా విద్యార్థులకు చెల్లించే ధరలను పెంచాలని కోరుతున్నారు.

మహిళ ఆత్మహత్య



నైనారపు శ్రీలక్ష్మి(ఫైల్)

జంగారెడ్డిగూడెం: అనారోగ్యంతో బాధపడుతూ మనస్తాపానికి గురై మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన స్థానిక బాట గంగానమ్మ లేఅవుట్ కాలనీలో చోటు చేసుకుంది. హెచ్‌సీ ఎస్ ఉమామహేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. బాట గంగానమ్మ లేఅవుట్ కాలనీకి చెందిన నైనారపు శ్రీలక్ష్మి నాలుగేళ్లుగా గర్భాశయ క్యాన్సర్‌కు చికిత్స తీసుకుంటుంది. క్యాన్సర్ బాధ నుతట్టుకోలేక మనస్థాపానికి గురైన శ్రీలక్ష్మి ఈ నెల 27వ తేదీ తెల్లవారుజామున ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఉదయం కుటుంబ సభ్యులకు ఫ్యానుకు వేలాడుతూ శ్రీలక్ష్మి కనిపించింది. శ్రీలక్ష్మి కుమారుడు నైనారపు వీరాంజనేయులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని హెచ్‌సీ తెలిపారు.

సారా తయారీ కేంద్రాలపై దాడి



సారా తయారీ సామగ్రితో పోలీసులు

కుక్కునూరు: మండలంలోని సీతారామ నగరం గ్రామం సమీపంలోని కిన్నెరసాని వాగు ఒడ్డున సారా తయారీ కేంద్రాలపై బుధవారం కుక్కునూరు పోలీసులు దాడులు చేశారు. 1200 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి, 20 లీటర్ల సారాను, సారా తయారీకి ఉపయోగించే అల్యూమినియం పాత్రలు, డ్రమ్ములను స్వాధీనం చేసుకున్నట్టు సీఐ రమేష్ బాబు తెలిపారు. సారా తయారు చేసే వారి సమాచారాన్ని ఫోన్ నెంబర్లు 112 లేదా 94407 96608లో తెలియజేయాలని కోరారు.

మద్యంతో వ్యక్తి అరెస్ట్

తణుకు అర్బన్: ఇరగవరం గ్రామానికి చెందిన సుమాల ఆంజనేయులు అనే వ్యక్తిని అరెస్ట్ చేసి ఆరు మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామని సీఐ ఎస్ మణికంఠరెడ్డి తెలిపారు. దాడుల్లో ఎస్సై బి.లక్ష్మి, ఆర్ మధుబాబు, సిబ్బంది పాల్గొన్నట్టు తెలిపారు.

మద్యం విక్రేత అరెస్ట్

ముసునూరు: మండలంలోని గుళ్లపూడికి చెందిన ఓ మహిళను అరెస్ట్ చేసి, ఆరు మద్యం క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు నూజివీడు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ మస్తానయ్య తెలిపారు. నల్లబెల్లం, మద్యం, నాటుసారా తయారీ, విక్రయాలు, బెల్ట్‌షాపులు నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. బుధవారం సాయంత్రం నిర్వహించిన దాడుల్లో ఎక్సైజ్ ఎస్సై వై.ఈశ్వరరావు, ఎం ప్రసాద్ సిబ్బంది పాల్గొన్నారని తెలిపారు.

లెక్కల మాస్టారుకు షోకాజ్ నోటీసు



విద్యార్థిని తిడుతున్న ఉపాధ్యాయుడు ముత్యాలరావు

ద్వారకాతిరుమల: స్థానిక ఎంపీయూపీ పాఠశాలలో విద్యార్థులు, వారి తల్లిదండ్రుల పట్ల లెక్కల ఉపాధ్యాయుడు ఎంఎస్‌వీ ముత్యాలరావు ప్రవర్తన సరిగ్గా లేదని అధికారుల విచారణలో తేలడంతో జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ ఆయనకు షోకాజ్ నోటీసు జారీ చేశారు. ద్వారకాతిరుమల ఎంపీయూపీ పాఠశాలలో లెక్కల ఉపాధ్యాయుడు ముత్యాలరావు తరచు విద్యార్థులను ఇష్టానుసారం కొడుతూ, తిడుతున్నాడన్న ఆరోపణలు ఉన్నాయి. ఈనెల 25న ముత్యాలరావు తమ పిల్లలను చితక్కొట్టాడని గుండే ధర్మరాజు, గుండే మాణిక్యం, మరో వ్యక్తి ద్వారకాతిరుమలకు వచ్చిన ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజుకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దీనిపై 26న పత్రికల్లో కథనాలు ప్రచురితం కావడంతో ఎంఈఓ–2 పరసా వెంకట్రావును డీఈఓ వెంకటలక్ష్మమ్మ విచారణకు ఆదేశించారు. బాధిత విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నుంచి, ప్రధానోపాధ్యాయురాలు వరలక్ష్మి, ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉపాధ్యాయుడు ముత్యాలరావు నుంచి ఎంఈఓ స్టేట్‌మెంట్లను రికార్డు చేశారు. ముత్యాలరావు ప్రవర్తన సరిగ్గా లేదని విచారణలో తేలడంతో క్రమశిక్షణా చర్యలు ఎందుకు తీసుకోకూడదో వచ్చేనెల 4లోపు వివరణ ఇవ్వాలని డీఈఓ షోకాజ్ నోటీసు జారీ చేశారు. ఇదిలా ఉంటే తరగతి గదిలో ఉపాధ్యాయుడు ముత్యాలరావు ఒక విద్యార్థిని తిడుతున్నప్పుడు తీసిన ఫొటో బుధవారం సామాజిక మాధ్యమంలో దర్శనమిచ్చింది.

ఎంప్లాయీస్ కాలనీలో భారీ చోరీ

25 కాసుల బంగారు నగలు అపహరణ



ఇంటిలో చోరీ ఆధారాలను సేకరిస్తున్న క్లూస్ టీం, సీఐ సత్య శ్రీనివాస్

నూజివీడు: స్థానిక ఎంప్లాయీస్ కాలనీలో మంగళవారం రాత్రి భారీ చోరీ జరిగింది. ఏపీసీపీడీసీఎల్ పట్టణ ఏడీ ఓలేటి దుర్గారావు ఇంట్లో దాదాపు 25 కాసుల బంగారు నగలను దుండగుడు దోచుకెళ్లారు. ఏడీ దుర్గారావు సమావేశం నిమిత్తం ఆగిరిపల్లి వెళ్లగా ఇంట్లో భార్య రమాదేవి, తల్లి ఉన్నారు. రాత్రి 10 గంటల సమయంలో తలుపులు వేయకుండా ఉండటంతో దుండగుడు ఇంట్లోకి చొరబడి బెడ్‌రూమ్‌లో బీరువా తెరిచి నగలు ఉన్న బ్యాగ్‌ను తీసుకుపోయాడు. కొద్దిసేపటికి రమాదేవి ఇంటి తలుపులు వేసేందుకు వచ్చి చోరీ జరిగినట్టు గుర్తించారు. ఈలోగా భర్త దుర్గారావు రావడంతో వెంటనే పోలీసులకు సమాచారమిచ్చారు. సీఐ పి.సత్య శ్రీనివాస్ ఘటనా స్థలిలో వివరాలను సేకరించారు. ఎవరూ నిద్రించకముందే చోరీ జరగడంపై ప్రజల్లో ఆందోళన వ్యక్తమౌతోంది.

వివరాల సేకరణ

బుధవారం ఉదయం ఏలూరు నుంచి క్లూస్ టీం వచ్చి బెడ్‌రూమ్‌లోని బీరువా, తలుపులు, గుమ్మాలకు పడిన వేలిముద్రలను సేకరించారు. ఎంప్లాయీస్ కాలనీలో ఉన్న సీసీ కెమెరా ఫుటేజీని పోలీసులు పరిశీలిస్తున్నారు.

ఆట్యాపాట్యా జిల్లా జట్ల ఎంపిక



ఆట్యాపాట్యా మహిళల జిల్లా జట్టు, పురుషుల జిల్లా జట్టు

భీమవరం: ఆట్యా, పాట్యా జిల్లా స్థాయి సీనియర్ సెలక్షన్స్ పోటీలు బుధవారం స్థానిక ఎస్‌సీహెచ్ బీఆర్‌ఎం హైస్కూల్లో నిర్వహించారు. సీనియర్స్ పురుషులు, మహిళల జట్ల ఎంపిక కోసం జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో క్రీడాకారులు హాజరయ్యారు. ఈ పోటీల్లో బాయ్స్ టీమ్‌కు ఎం శివ కె.తేజ అమర్‌నాథ్, బి.సాయి, ఎం లీలా గణేష్, ఆర్ ఏసు, ఎస్ ఆదిత్య వెంకటదుర్గ, డి.మోహన్, కె.వేణుసాయి, బి.సతీష్, డి.గోపీకృష్ణ, బి.శిలువరాజు, డి.సాయి కృష్ణ ఎంపికయ్యారని ఆట్యాపాట్యా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మంతెన రామచంద్రరాజు తెలిపారు. బాలికల జట్టుకు ఎ.భువన చంద్రిక, ఆర్ మనీషా, జి.నిత్యశ్రీ, డి.కీర్తి, డి.గోపిక ఆదిసాయి, ఆర్ దయ, డి.దివ్యజ్యోతి, ఎం జోష్న, ఎస్ హేమ, ఎస్ గ్రీష్మ, డి.శ్రీచిత్ర, ఎం మౌనిక, నందిని ఎంపికయ్యారని చెప్పారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 30, డిసెంబర్ 1వ తేదీన భీమవరంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని వివరించారు. ఆట్యా, పాట్యా జిల్లా జట్టు ఎంపికలో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి జి.కిరణ్ వర్మ, పీఈటీ జీపీసీ శేఖర్‌రాజు పాల్గొన్నారు.

పుస్తక పఠనం ఉపయుక్తం



ఓరియంటేషన్ కార్యక్రమంలో పీజీ విద్యార్థులు

తాడేపల్లిగూడెం : విద్యార్థులు తమ ఖాళీ సమయాల్లో పుస్తక పఠనంతో గడిపితే ఉపయుక్తంగా ఉంటుందని నన్నయ్య విశ్వవిద్యాలయ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ విజయనిర్మల అన్నారు. పట్టణంలోని నన్నయ్య క్యాంపస్‌లో బుధవారం పీజీ విద్యార్థులకు నిర్వహించిన ఓరియంటేషన్ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. విద్యార్థులు తమ ఉన్నతికి ఉపయోగపడే అంశాలపై ఆసక్తిని పెంచుకోవాలన్నారు. భవిష్యత్‌ను నిర్దేశించుకోడానికి, అకడమిక్స్‌లో రాణించడానికి విద్యాలయం వేదికగా ఉంటుందని తెలిపారు. ప్రాంగణంలో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని రాణించాలని ప్రిన్సిపాల్ టి.అశోక్ విద్యార్థులకు సూచించారు. సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రత్యేక కౌంటర్ల ద్వారా ఉల్లి, పామాయిల్ అమ్మకాలు

జాయింటు కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి



భీమవరం (ప్రకాశంచౌక్): నాణ్యమైన ఉల్లిపాయలు కిలో రూ.50, పామాయిల్ రూ.110కు ప్రత్యేక కౌంటర్ల ద్వారా విక్రయించాలని జిల్లా జాయింటు కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో సివిల్ సప్లైస్, మార్కెటింగ్, హోల్ సేల్ ఉల్లిపాయల వర్తకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఉల్లిపాయలు, పామాయిల్ బల్క్‌గా కొనుగోలు చేసి ప్రతి నియోజకవర్గానికీ ఒక కౌంటర్ మార్కెటింగ్ శాఖ ద్వారా ఏర్పాటుచేసి అమ్మకాలు చేపట్టాలన్నారు. తొలి దశలో రేపటి నుంచి తణుకు, తాడేపల్లిగూడెంలలో ప్రత్యేక కౌంటర్ల ద్వారా ఈ అమ్మకాలు ప్రారంభించాలని ఆదేశించారు. మిగిలిన ఐదు నియోజకవర్గాల్లో అమ్మకాలు ప్రారంభమవుతాయని చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని జేసీ కోరారు. డీఎస్‌ఓ ఎన్ సరోజ, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి కె.సునీల్ కుమార్, సీపీఓ కార్యాలయ సహాయ సంచాలకులు కె.శ్రీనివాసరావు, భీమవరం రైతు బజారు ఎస్టేటు అధికారి పి.కళ్యాణ్, ఉల్లి హోల్ సేల్ వర్తకులు, ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలు ఇప్పిస్తామని టోకరా

జంగారెడ్డిగూడెం: జాబ్ ఇప్పిస్తామని మోసం చేసిన నేరంపై ఐదుగురిపై కేసు నమోదు చేశామని ఎస్సై షేక్ జబీర్ తెలిపారు. బుట్టాయగూడెంకు చెందిన కదారి హర్షవర్ధన్ జంగారెడ్డిగూడెంకు చెందిన ఇబ్బా యామలరావు అనే వ్యక్తికి రైల్వే టీసీ జాబ్ ఇప్పిస్తానని మాయమాటలు చెప్పి రూ.7.35 లక్షలు, యామలరావు స్నేహితుడు గుర్రం గంగాధరరావు అనే వ్యక్తి నుంచి రూ.2.50 లక్షలు తీసుకున్నాడు. దారా నవీన్ అనే వ్యక్తికి పడాల ప్రభాకర్, రాణిలు పోస్టల్ జాబ్ ఇప్పిస్తామని చెప్పి రూ.4.50 లక్షలు, కండెల్లి తేజ, అతని సోదరుడికి రైల్వే జాబ్ ఇప్పిస్తానని రూ.8 లక్షలు తీసుకుని మోసం చేశారు. గంజి మురళి రూ.80 వేలు, భారతి రూ.80 వేలు తీసుకుని ఎటువంటి జాబ్ ఇప్పించకుండా మోసం చేశారని ఎస్సై వివరించారు.

బాలికపై అత్యాచారయత్నం

పెంటపాడు: ఓ బాలికపై అత్యాచారయత్నం చేయబోయాడన్న నేరంపై మంగళవారం మండలంలోని ఓ గ్రామంలో ఉంటున్న ఆర్ మసేనయ్య అనే వ్యక్తిని అరెస్టు చేశామని ఎస్సై స్వామి తెలిపారు. మసేనయ్యపై పోక్సో కేసు నమోదు చేసి, కోర్టుకు హాజరుపరిచామని తెలిపారు.



లక్ష దీపార్చన

కార్తీకమాసం సందర్భంగా పాలకొల్లు పంచారామక్షేత్రం క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయం చుట్టూ శివలింగం, త్రిశూలం అలంకరణల్లో బుధవారం రాత్రి దీపాలంకరణ చేశారు. ఆలయం వెనుకభాగంలో క్షీరారామం, ద్రాక్షారామం, సామర్లకోట, భీమవరం, అమరావతి పంచారామ క్షేత్రాల శివలింగాలతో ప్రత్యేక దీపాలంకరణ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దీపాలను వెలిగించిన దృశ్యమిది.

– పాలకొల్లు సెంట్రల్

క్లుప్తంగా

గుడ్‌టచ్.. బ్యాడ్‌టచ్‌పై అవగాహన



విద్యార్థినులకు సూచనలిస్తున్న మహిళా పోలీసులు

తాడేపల్లిగూడెం: గుడ్‌టచ్, బ్యాడ్ టచ్ గురించి విద్యార్థినులు తెలుసుకోవాలని ఏఎస్‌ఐ ఉమామహేశ్వరి తెలిపారు. బుధవారం పట్టణంలోని ఏపీ ఎస్ఎస్ఎస్ఆర్ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ప్రమాదకరమైన సమయాల్లో బాలికలు తమకు తాము ఎలా రక్షించుకోవాలి అనే విషయాలను బుధవారం వివరించారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాల గురించి చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌ఐ ఉమామహేశ్వరి, మహిళా కానిస్టేబుళ్లు భాగ్యలక్ష్మి, లీలా, పాఠశాల హెచ్‌ఎం విజయకుమారి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

అత్తిలిలో 12 సీసీ కెమెరాల ఏర్పాటు



అత్తిలిలో సీసీ కెమెరాలను పరిశీలిస్తున్న ఎస్‌ఐ ప్రేమరాజు

అత్తిలి: అత్తిలి గ్రామంలో ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామని ఎస్‌ఐ ప్రేమరాజు బుధవారం చెప్పారు. త్వరలో అత్తిలిలో జరిగే శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి మహోత్సవాలలో గొడవలు, అల్లర్లు, దొంగతనాలు జరగకుండా ఉండేందుకు దాతల సహకారంతో 12 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసామని వెల్లడించారు. పరిసర గ్రామాల నుంచి అత్తిలి గ్రామంలోకి ప్రవేశించి ప్రతి మార్గంలో ఈ సీసీ కెమెరాలు ఉండేవిధంగా అమర్చామని చెప్పారు. ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును ఎస్‌ఐ పరిశీలించారు.

గౌరీదేవికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో గౌరీదేవి అమ్మవారు

పెంటపాడు: మండలంలోని గౌరీదేవి అమ్మవారి ఉత్సవాలు సందర్భంగా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు అధిక సంఖ్యలో కుంకుమ పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో వెలమ సంక్షేమసంఘ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఉమాసోమేశ్వర స్వామికి లక్ష రుద్రాక్ష పూజలు



ఉమాసోమేశ్వరునికి రుద్రాక్ష పూజలు నిర్వహించిన దృశ్యం

అత్తిలి: కార్తీకమాసం సందర్భంగా ఆరవల్లి గ్రామంలో గల ఉమాసోమేశ్వర స్వామికి బుధవారం లక్ష రుద్రాక్షపూజలు, అన్నాభిషేకం నిర్వహించారు. ఉదయం స్వామివారికి పంచామృతాలు, పండ్లరసాలు సుగంధ పరిమళ ద్రవ్యాలతో అభిషేకించి విశేషంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు.

వరి కోతలు నిలిపివేయాలి



రైతులతో మాట్లాడుతున్న ఏఓ రాజేష్

అత్తిలి: వాతావరణ శాఖ హెచ్చరికలను అనుసరించి తుఫాన్ ప్రభావం వల్ల వర్షాలు కురిసే అవకాశం ఉందని మండల వ్యవసాయశాఖ అధికారి టీకే రాజేష్ చెప్పారు. రైతులు రానున్న మూడు రోజుల పాటు వరికోతలు వాయిదా వేసుకోవాలని సూచించారు. కోసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని చెప్పారు. అత్తిలి మండలం తిరుపతిపురం, అత్తిలి, లక్ష్మీనారాయణపురం, వరిఘేడు గ్రామాల్లో ఆయన పర్యటించి వరిమాసూళ్లను పరిశీలించి రైతులకు సూచనలు చేశారు.

ఎన్నాళ్లీ నిరీక్షణ?



శాంతినగర్‌లో 32వ వార్డులోని డ్రెయినేజీ వ్యవస్థ లేని మట్టి రహదారులు



శాంతినగర్‌లో చెట్ల మధ్యలో నుంచి విద్యుత్ తీగలు

- మురుగుతో నిండిన కాలువలు
- అధ్వానంగా రోడ్లు
- విపరీతంగా దోమలు
- పట్టించుకోని అధికారులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని కడకట్లలో 32వ వార్డు, శాంతినగర్‌లోని విమాన బిల్డింగ్ రోడ్డు పరిసర ప్రాంతాలకు చెందిన కాలనీ వాసులు పడుతున్న ఇబ్బందులు తొలగించాలని ఆ కాలనీ వాసులు కోరుతున్నారు. గత 15 సంవత్సరాలుగా నివాసాలు ఏర్పాటు చేసుకుని వారు జీవిస్తున్నప్పటికి నాటి నుంచి నేటి వరకు రోడ్డు సదుపాయం లేకుండా మట్టి రోడ్డు మాత్రమే ఉంది. ముఖ్యంగా వర్షకాలంలో నడవడానికి కూడా వీలు లేని పరిస్థితులు నెలకుని ఉన్నాయి. వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ ప్రాంతంలో డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో ఎక్కడ మురుగు అక్కడే ఉంటుంది. ఖాళీ స్థలాలు ఉన్న ప్రాంతాలలో మురుగు గుంటలు ఉండటంతో పాటు డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో దుర్వాసన, దోమల బెడద అధికంగా ఉంది. ఖాళీ స్థలాలలో పిచ్చిమొక్కలు, గుబురు మొక్కలు, పొదలు ఉండటంతో పాములు, జెర్రిలు, విష కీటకాలు బెడద అధికంగా ఉంది. దీంతో స్థానికులు సాయంత్రం అయ్యేసరికి రహదారి మార్గాలలోకి వచ్చేందుకు భయాందోళన చెందుతున్నారు. విద్యుత్ లైన్‌లు ఉన్నా విద్యుత్ వైర్లు చెట్ల కొమ్మల మధ్య నుంచి వెళ్లడంతో పాటు అవి నేలకు అందే విధంగా ఉంటూ కిందకు వేళాడుతూ ఉన్నాయి. దీంతో అవి చేతికి అందే విధంగా ఉండటంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ తీగలను సరి చేయాలని ఆ కాలనీ వాసులు కోరుతున్నారు. ఇది ఇలా ఉంటే విమాన భవనం రోడ్డులో ఇటీవల కొంత మేర సీసీ రోడ్డు నిర్మాణం చేశారు. మిగిలిన రహదారిని కూడా నిర్మించాలని ఆయా సమస్యలను పరిష్కరించాలని అధికారులను కోరినప్పటికి ఫలితం ఉండటం లేదని, అధికారులు ఇప్పటికైనా స్పందించి కడకట్ల శాంతినగర్ కాలనీ వాసుల సమస్యలు పరిష్కరించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



శాంతినగర్‌లో ఖాళీ స్థలంలో మురుగు

రహదారి నిర్మాణం చేపట్టాలి



కడకట్లలోని శాంతినగర్‌లోని విమాన భవనం వద్ద నుంచి రహదారిలో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టాలి. డ్రెయినేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలి. దోమల బెడద నుంచి, పాములు, విష జంతువులు బెడద నుంచి కాపాడాలి. పరిసరాల పరిశుభ్రం చేసేందుకు సంబంధిత అధికారులు కృషి చేయాలి. –ఎం.వీ. రమణయ్య, సీనియర్ సిటిజన్, శాంతినగర్

విద్యుత్ తీగలను సరిచేయాలి



కడకట్లలోని శాంతినగర్‌లో విద్యుత్ లైన్‌లను సరి చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నామన్నారు. కాలనీలో పిచ్చి మొక్కలను తొలగించాలని కోరారు.

–ఎం.అనంతలక్ష్మి, సీనియర్ సిటిజన్, శాంతినగర్

ఉద్దరాజు రామంను యువత ఆదర్శంగా తీసుకోవాలి



సీపీఎం కార్యాలయంలో వర్ధంతి సభ



తణుకులో ఉద్ధరాజు రామం చిత్రపటానికి పూలమాల వేస్తున్న ప్రతాప్

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్వాతంత్ర్య సమరయోధుడు, జీవితాంతం ప్రజల పక్షాన నిలిచి పోరాడిన యోధుడు ఉద్దరాజు రామంను ఈనాటి యువతరం ఆదర్శంగా తీసుకోవాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఉద్దరాజు రామం 30వ వర్ధంతి సభ బుధవారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో గొన్నాబత్తుల నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. రామం చిత్రపటానికి నాయకులు పూలమాల వేసి నివాళ్లులర్పించారు. కర్రి నాగేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలో కార్మిక ఉద్యమ నిర్మాతలతో ఒకరైన ఉద్దరాజు రామం ఉన్నత కుటుంబంలో జన్మించి పేద, పీడిత ప్రజల కోసం నిరంతరం పోరాటం చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ, సాయిరెడ్డి, దత్తు రాము, పోతు శ్రీను, శిద్దిరెడ్డి శేషుబాబు, గణేష్, సాయి, జాన్, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్ధరాజు రామంకు ఘన నివాళులు

తణుకు అర్బన్: స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ ఎంపీ, జిల్లా కమ్యూనిస్ట్ ఉద్యమ నిర్మాత కామ్రేడ్ ఉద్ధరాజు రామం పోరాట స్ఫూర్తితో ప్రజలు, రైతుల సమస్యలపై సీపీఎ పార్టీ పోరాటం చేస్తుందని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పీవీ ప్రతాప్ అన్నారు. రామం 30వ వర్ధంతి సందర్భంగా బుధవారం తణుకు అమరవీరుల భవనంలో ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ ప్రాణాలను ఫణంగా పెట్టి స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న పోరాట యోధుడని కొనియాడారు. అపారమైన దేశ భక్తితో దేశ ప్రజల సుఖ సంతోషాలకు సోషలిస్ట్ సమాజం కోసం చివరి వరకు పోరాడిన మహనీయుడని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకులు గారరంగారావు, గుబ్బల గోపి, మూర్తి, ఉష తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం



సమావేశంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సీడీపీవో ప్రమోదిని కుమారి

తణుకు టౌన్: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఐసీడీఎస్ సీడీపీవో ఎంబీఎస్ ప్రమోదిని కుమారి చెప్పారు. బుధవారం తణుకు రూరల్ మండలం దువ్వ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలికలకు, తల్లిదండ్రులకు నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. పిల్లలకు చిన్నప్పటి నుంచి చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండటంతో మంచి చెడుల గురించి తెలుస్తుందన్నారు. పిల్లలకు అవసరం మేరకే సెల్‌ఫోన్‌లు వాడాలని, 18 ఏళ్లు నిండని పిల్లలు మోటారు సైకిళ్లు నడపరాదని చెప్పారు. మైనర్ పిల్లలు మోటారు సైకిళ్లు నడిపి ప్రమాదాలు చేస్తే వారి తల్లిదండ్రులపై చర్యలు తీసుకుంటారని చెప్పారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ డీవీఎస్ఎస్ అశోక్ వర్మ, న్యాయవాదులు కౌరు వెంకటేశ్వర్లు, ఐసీడీఎస్ సూపర్ వైజర్ సీహెచ్ వెంకట లక్ష్మీ, పాఠశాల హెచ్‌ఎం బండి ఆంజనేయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేటి నుంచి తణుకులో సిద్ధపాటు సమావేశాలు

పెంటపాడు: ఈనెల 28 నుంచి మూడు రోజుల తణుకు పైడిపర్రులోని ఈపీఎఫ్ చర్చిలో సిద్ధపాటు సమావేశాలు నిర్వహించనున్నట్లు సంఘ కాపరి పి.మోజెస్ ప్రవీణ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశాలలో దైవసేవకులు పి. అరుణకుమారి, సేవకురాలు ప్రైజీ ప్రవీణ్‌లు దేవుని వాక్యం అందిస్తారన్నారు. డిసెంబర్ 1 నుంచి క్రిస్మస్ వేడుకలు పురస్కరించుకొని ఈ సమావేశాలను సంఘ సభ్యులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పరిమెళ్లలో స్వచ్ఛందంగా ఆక్రమణల తొలగింపు

పెంటపాడు: మండలంలోని పరిమెళ్లలోని జగనన్న కాలనీకి సంబంధించి పలువురు లబ్ధిదారులు వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లే మార్గాన్ని, పాతన వంతెనను ఆక్రమించుకొని గుడిసెలు వేసుకొని జీవనం సాగిస్తున్నారు. పొలాల వద్దకు వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నామంటూ స్థానిక రైతులు ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అప్పటి నుంచి అధికారులు ఇళ్లు ఖాళీ చేయాలని చెబుతూనే వచ్చారు. బాధితులు, అధికారులకు మధ్య హైడ్రామా నడుస్తూనే ఉంది. చివరకు బాధితులు బుధవారం స్వచ్ఛందంగా ఇళ్లు తొలగించుకుంటున్నారు. దీంతో ఈ వివాదం ముగిసింది.

ఎన్‌సీసీ కేడెట్ల ఐక్యతా ర్యాలీ



ఎన్‌సీసీ కేడెట్ల ఐక్యతా రన్ ప్రారంభిస్తున్న కరస్పాండెంట్ చిట్టూరి సత్య ఉషారాణి

తణుకు టౌన్: ఎన్‌సీసీ దినోత్సవం సందర్భంగా తణుకు ఎస్‌కెఎస్‌డీ మహిళా కళాశాలకు చెందిన ఎన్‌సీసీ కేడెట్లు ఐక్యతా రన్ నిర్వహించారు. బుధవారం తణుకులోని మహిళా కళాశాల వద్ద ఈ ర్యాలీని కళాశాల కరస్పాండెంట్ చిట్టూరి సత్య ఉషారాణి ప్రారంభించారు. కళాశాల వద్ద నుంచి మూడు కిలీ మీటర్ల ఐక్యతా రన్ నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ యూ లక్ష్మీసుందరి బాయి తెలిపారు.

చలో విజయవాడను విజయవంతం చేయండి



పోస్టర్లును విడుదల చేస్తున్న సీపీఎస్ ఉద్యోగులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పాత పెన్షన్ విధానం అమలు చేయాలని కోరుతూ డిసెంబర్ 10వ తేదీన ఛలో విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు, ఏపీసీపీఎస్ఈఏ మండల అసోసియేట్ అధ్యక్షుడు జీవీవీ లక్ష్మీనారాయణ కోరారు. పట్టణంలో బుధవారం ఛలో విజయవాడ పోస్టర్లును విడుదల చేశారు. సీపీఎస్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

రైతులు ధాన్యాన్ని భద్రపర్చుకోవాలి



కృష్ణాయపాలెం గ్రామంలో రైతులతో మాట్లాడుతున్న ఏవో ఆర్ఎస్.ప్రసాద్

తాడేపల్లిగూడెం రూరల్: ఆరబెట్టిన, కల్లాల్లో ఉన్న ధాన్యాన్ని టార్పాన్లు కప్పి భద్రపర్చుకోవాలని మండల వ్యవసాయాధికారి ఆర్ఎస్. ప్రసాద్ రైతులకు సూచించారు. బుధవారం మండలంలోని పడాల, కడకట్ల, కృష్ణాయపాలెం, జగన్నాథపురం, యాగర్లపల్లి ప్రాంతాల్లో ఆయన పర్యటించి, రైతులను అప్రమత్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే నాలుగు రోజులు వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిస్తున్న నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. మండలంలో 2500 ఎకరాల్లో వరి కోతలు కోయాల్సి ఉందని, రాబోయే నాలుగు రోజులు కోతలు నిలిపివేయాలన్నారు. మరో 4100 ఎకరాల్లో ధాన్యం ఆరబెట్టుకున్నారని, రైతులందరూ ఆర్ఎస్‌కే ద్వారా మిల్లులకు తరలించాలన్నారు. రైతాంగానికి అవసరమైన గోనె సంచులు, రవాణా వాహనాలు సిద్ధంగా ఉంచామన్నారు.

మానవత సంస్థ సేవలు మరువలేనివి



వైద్య శిబిరంలో పాల్గొన్న మానవత సంస్థ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): మానవతా స్వచ్ఛంధ సేవా సంస్థ సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. పట్టణంలోని అమ్మ కల్యాణ మండపంలో సంస్థ ఆధ్వర్యంలో కామినేని ఆసుపత్రి విజయవాడ వారిచే ఉచిత మెగా వైద్య శిబిరం జరిగింది. గుండె, న్యూరో, గైనిక్, జనరల్‌కు సంబంధించి 150 మందికి వైద్య పరీక్షలు చేశారు. ప్రజలకు వ్యాధులపై అవగాహన చేశారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈతకోట తాతాజీ శిబిరాన్ని ప్రారంభించారు. జనతా వైద్యులు నాగేశ్వరరావు సహకారం అందజేశారు. మానవత అధ్యక్షుడు పచ్చ వెంకటేశ్వరరావు, సెక్రటరీ యర్రా ఆంజనేయస్వామి, కోశాధికారి యెగ్గిన శరత్ బాబు, చేకూరి బంగార్రాజు, పట్నాల రాంపండు, బురిడి సతీష్, ఎం.సతీష్, రాజేంద్ర, హరికుమార్, పాండురంగారావు, గురుమూర్తి, వెంకటాచలం తదితరులు పర్యవేక్షించారు.

దైవక్షేత్రాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

తణుకు అర్బన్: కార్తీక మాసం సందర్భంగా వచ్చేనెల 1వ తేదీ దైవక్షేత్రాల దర్శనార్థం ఆర్టీసీ ప్రత్యేక బస్సు నడుపుతున్నట్లు తణుకు డిపో మేనేజరు సప్పా గిరిధర్‌కుమార్ తెలిపారు. ఆదివారం ఉదయం 5 గంటలకు బయలుదేరే బస్సు అంతర్వేది, అప్పనపల్లి, కుండలేశ్వరం, మురుమళ్ల, ముక్తేశ్వరం దైవక్షేత్రాల దర్శనానంతరం తణుకు చేరుతుందని, టికెట్ ధర రూ. 400లుగా నిర్దేశించినట్లు చెప్పారు. కార్తీకమాసం చివరిరోజు కావడంతో భక్తులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మన్యసీమ, కోరంగి, కాకినాడ బీచ్ విహారయాత్ర స్పెషల్ బస్సులు కూడా ఏర్పాటుచేసినట్లు వివరించారు. ఇతర వివరాలకు 7382907027, రిజర్వేషన్ కోసం 9440419144 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఎర్రకాలువ ముంపునకు పరిష్కారం చూపాలి



పాలుపూరి సత్యనారాయణ

తాడేపల్లిగూడెం రూరల్: ఎర్ర కాలువ ముంపునకు శాశ్వత పరిష్కారం చూపాలని సీపీఎం పార్టీ తాడేపల్లిగూడెం మండల కన్వీనర్‌గా పాలుపూరి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మహాసభలో తీర్మానించిన పలు డిమాండ్లను వెల్లడించారు. రోడ్లన్నీ నిర్మించాలని, నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలని, అర్హులైన వారందరికీ కొత్త వారికి పింఛన్లు ఇవ్వాలని, ఉపాధి హామీ పనులు 200 రోజులు, రోజుకు రూ.600లు వేతనం ఇవ్వాలని, అర్హులైన వారందరికీ ఇంటి స్థలం, ఇల్లు నిర్మించాలని డిమాండ్ చేశారు. ముందుగా మండల మహాసభలో మండల సీపీఎం కమిటీని ఎన్నుకున్నారు. తాడేపల్లిగూడెం మండల సీపీఎం పార్టీ మండల కన్వీనర్‌గా పాలుపూరి సత్యనారాయణ ఎన్నికయ్యారు. తనతో పాటు కమిటీ సభ్యులుగా కండెల్లి సోమరాజు, పాలుపూరి సత్యవతి, పురిటిగడ్డ జయమ్మ, సిద్ధాబత్తుల నాగేశ్వరరావు, సుబ్బారావులు ఎన్నికైనట్లు వివరించారు.

గ్లోబల్ సపోర్ట్ సేవలు అభినందనీయం



ఆటో ద్వారా బియ్యం పంపుతున్న గ్లోబల్ సపోర్ట్ ట్రస్టు సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): గ్లోబల్ సపోర్ట్ ఆర్గనైజేషన్ వారిచే ఫౌండర్ త్రికళ, దాత వాణి, ట్రస్టీ, వైఎస్సార్ సీపీ నాయకులు జనార్ధనరావు ఆధ్వర్యంలో 650 కేజీల బియ్యంను వివిధ సంస్థలకు అందజేశారు. బుధవారం ఆటో ద్వారా బియ్యం పంపిణీ చేశారు. పడాల జీవన సంధ్యా వృద్ధాశ్రమారనికి 200 కేజీలు, లార్డ్ ఆఫ్ లైఫ్ చిల్డ్రన్‌హోంకు 150 కేజీలు, నిడదవోలు లెప్రర్సీ కాలనీ 300 కేజీలు పంపిణీ చేసినట్లు ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వలంటీర్లు దుర్గా ప్రసాద్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

13,657 అసెస్‌మెంట్లు ఆన్‌లైన్

తాడేపల్లిగూడెం రూరల్: స్వర్ణ గ్రామ పంచాయతీ కార్యక్రమంలో భాగంగా మండలంలో 18,425 అసెస్‌మెంట్లకు గాను ఇప్పటి వరకు 13,657 అసెస్‌మెంట్లను ఆన్‌లైన్ చేశామని, మరో 4,558 అసెస్‌మెంట్లు ఆన్‌లైన్ చేయాల్సి ఉందని ఈవోపీఆర్‌డీ ఎం.వెంకటేష్ తెలిపారు. దీనిలో భాగంగా బుధవారం మండలంలోని కృష్ణాయపాలెం, దండగర్ర, జగన్నాథపురం, మెట్ట ఉప్పరగూడెం, పెదతాడేపల్లి గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ మరో రెండు,మూడు రోజుల్లో నూటికి నూరు శాతం లక్ష్యాన్ని పూర్తి చేస్తామన్నారు. తద్వారా పన్ను చెల్లింపు సులభతరం అవుతుందన్నారు. ఆయన వెంట కృష్ణాయపాలెం పంచాయతీ కార్యదర్శి వై. హరికిషోర్ ఉన్నారు.

ధాన్యం కొనేదెప్పుడు?

- కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో జాప్యం!
- రైతులకు గాలం వేస్తున్న దళారులు
- ముమ్మరంగా వరి కోతలు

ఇరగవరం: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసే విషయంలో నియోజకవర్గంలో జాప్యం నెలకుంది. అధికారులు ఇప్పటివరకూ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుపై దృష్టి సారించలేదు. దీంతో దళారీలు రైతులకు గాలం వేస్తున్నారు. పూర్తిస్థాయిలో వరికోతలు కాలేదనే కారణంతో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదని అధికారులు చెబుతున్నప్పటికీ క్షేత్ర స్థాయిలో ముమ్మురంగా కోతలు జరుగుతున్నాయి. అలాగే పొలాల్లో ధాన్యం రాశులు ఉండడం కనిపిస్తోంది. దీంతో అప్పుడే దళారులు రైతులను ఆశ్రయించి దగా చేయాలని చూస్తున్నారు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం యుద్ధ ప్రాతిపదికన కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిబంధనలు తీసేశారు. మద్దతు ధర వస్త మిల్లర్లు, బయట ప్రైవేట్ వ్యాపారస్తుల వద్ద అమ్మకాలు చేసుకోవచ్చేనే ప్రభుత్వ నిబంధనలు రైతులకు మంచి చేస్తాయో..నష్టం కలిగిస్తాయో.. ఎటు వైపు దారి తీస్తాయో వేచి చూడాలి. ఖరీఫ్ సీజన్‌లో నియోజకవర్గంలో సుమారు 84.046 ఎకరాల్లో వరి సాగుకు పది శాతం మినహాయిస్తూ సుమారు 1,70,539 మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తోందని అధికారులు అంచనా వేశారు. ఇప్పటికే ఇరవరం, రేలంగి, తదితర మండలాల్లో ఒక వైపు ముమ్మరంగా వరికోతలు జరుగుతున్నాయి.



ఇరగవరంలో రోడ్డుపై ఆరబోసిన ధాన్యం

దళారుల దోపిడీ కోసమే జాప్యం

ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు విషయంలో జరుగుతున్న జాప్యం కేవలం మిల్లర్లు, దళారులకు లాభం కలిగించడానికే అనే అనుమానం వస్తోంది. ఇప్పటికే కొంతమంది దళారులు రైతులను ఆశ్రయించి దగా చేయాలని చూస్తున్నారు. ఈ విషయంలో అధికారులు ప్రత్యేక దృష్టి సారించి రైతులకు న్యాయం చేయాలి.

ఏ ఒక్క రైతుకు అన్యాయం జరగదు



రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసే విషయంలో ఏ ఒక్క రైతుకు అన్యాయం జరగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నాం. బయట కనీస మద్దతు ధర ఉంటేనే అమ్మకాలు చేసే విధంగా రైతులుకు అవగాహన కల్పిస్తున్నాం. ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు అంతా సిద్ధం చేశాం. వరి కోతలు పూర్తయితే యుద్ధ ప్రతిపదికన ధాన్యం కొనుగోలు చేస్తాం. ఈ విషయంలో దిగువ స్థాయి అధికారులతో గట్టి చర్యలు చేపడుతున్నాం. ధాన్యం అమ్మకాలు చేసిన 48గంటల్లోనే రైతులకు డబ్బులు జమయ్యేలా ఏర్పాట్లు చేస్తున్నాం. రాఘవేంద్ర, ఏవో, ఇరగవరం